# మంచి వార్త

## ప్రకృతి ఒడిలో పాఠశాల



**ఐదేండ్ల కింద** కొవిడ్ కారణంగా బళ్లు మూసివేయాల్సి వచ్చిన సందర్భం గుర్తుండే ఉంటుంది. సరిగ్గా అలాంటి సమయంలోనే పశ్చిమ బెంగాల్‌కు చెందిన ప్రొఫెసర్ అంగ్శుమన్ ఠాకూర్ చదువును ఆరుబయటికి తీసుకువచ్చాడు. వందకుపైగా గిరిజన పిల్లల జీవితాల్లో మార్పునకు నాంది పలికాడు. అది ముర్షిదాబాద్ జిల్లాలోని బగ్డాబ్ర అటవీప్రాంతం. కరోనా మహమ్మారి ఎంతోమంది చిన్నారులకు బళ్లను దూరం చేసింది. పట్టణ ప్రాంతాల్లో సరే కానీ, మారుమూల గ్రామాల్లో ఆన్‌లైన్ తరగతులకు సరిపోయినన్ని వసతులు లేవు. బగ్డాబ్ర అటవీప్రాంతం పరిసరాల్లో ఉండే గిరిజన చిన్నారులకు చదువు అందని ద్రాక్షగా మారే పరిస్థితి దాపురించింది. ఇది అంగ్శుమన్ ఠాకూర్‌ను కదిలించింది. ప్రొఫెసర్ సయ్యద్ నూరుల్ హసన్ కాలేజీలో బెంగాలీ సాహిత్యం బోధించే ఆయన 2021లో వేప, మామిడి చెట్ల కింద ఓ బడిని ప్రారంభించాడు. 'అనిర్వాణ గాచెర్ ఇస్కూల్' అని దానికి పేరు పెట్టాడు. ఈ నిర్ణయానికి రవీంద్రనాథ్ ఠాగూర్ ప్రవచించిన సమగ్ర విద్యా విధానం స్ఫూర్తిగా నిలిచింది. మామూలు బడి పుస్తకాలతోపాటు చిత్రలేఖనం, మట్టితో బొమ్మలు చేయడం, సంగీతం వంటి సృజనాత్మక కళలకూ ఈ విధానంలో చోటు ఉంటుంది. చదువు కూడా చెట్ల కింద సాగుతుంది కాబట్టి, పిల్లలకు ప్రకృతితో విడదీయరాని బంధం ఏర్పడుతుంది. కేవలం ఐదుగురు పిల్లలతో మొదలైన ఈ పాఠశాలలో ఇప్పుడు వందకుపైగా విద్యార్థులు ఉన్నారు. ఎల్‌కేజీ నుంచి పన్నెండో తరగతి వరకు బోధన సాగుతున్నది. అంగ్శుమన్ సొంత నిధులు, విరాళాల అండతో నడిచే ఈ బడిలో ప్రతి పిల్లవాడి నుంచి నెలకు నామమాత్రపు ఫీజు వసూలు చేస్తున్నాడు. కరోనా కలకలం తగ్గిన తర్వాత కూడా ఈ బడి కొనసాగుతూనే ఉన్నది. మామూలు బడి వేళలకు ముందుగానే ఇక్కడ బోధన జరుగుతున్నది. పిల్లలు రోజువారీగా తాము వెళ్లే బడికి వెళ్లడానికీ వెసులుబాటు దొరుకుతున్నది. కొత్తతరం పిల్లల కోసం పర్యావరణ హితమైన బడి, గ్రంథాలయం, కంప్యూటర్ ల్యాబ్ ఉండాలనేది అంగ్శుమన్ ఆశయం. చాలా చోట్ల బళ్లు ఆటస్థలాలు, ప్రకృతి సహజమైన వాతావరణం లేకుండానే నడుస్తున్నాయి. ఈ పరిస్థితిలో కొంతైనా మార్పు రావడానికి అంగ్శుమాన్ చొరవ స్ఫూర్తిగా నిలుస్తుంది.

## వైతాళికుల వాణి

కేవలం సమాచారం
ఇచ్చేది కాకుండా,
మన చుట్టూ ఉన్న పరిసరాలతో
మనల్ని సామరస్యంగా జీవించేలా
చేసేదే అత్యుత్తమమైన విద్య.

• **రవీంద్రనాథ్ టాగూర్**

## క్యా సీన్ హై!

